సాక్షి గుంటూరు

సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



దుర్గమ్మ సేవలో జయేంద్రపురి స్వామిజీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బెంగళూరు శ్రీ కైలాస ఆశ్రమ మహాసంస్థానం పీఠాధిపతి జయేంద్రపురి మహా స్వామిజీ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



దుర్గమ్మ సేవలో పీటీ ఉష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉష ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు.



వైభవంగా మానుకొమ్మల పండుగ

ఫిరంగిపురం: ఫిరంగిపురంలోని బాలఏసు దేవాలయంలో మానుకొమ్మల పండుగ ఆదివారం వైభవంగా నిర్వహించారు. మేత్రానగురువులు భాగ్యయ్య పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

టికెట్ లేని ప్రయాణికుల నుంచి రూ.1.23 కోట్లు వసూలు

టీటీలను అభినందించిన గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణించే వారిని గుర్తించి వారి నుంచి రూ.1.23కోట్లు వసూలు చేసినట్లు డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. వసూలులో కీలక పాత్ర వహించిన టీటీలు పద్మారావు, కె.హేమలతలను ఆయన ఆదివారం అభినందించారు. గుంటూరు స్టేషన్‌లో టీటీగా పనిచేస్తున్న వై.ఎన్.పద్మారావు 8499 కేసులు నమోదు చేసి వాటికి గాను రూ.73,15,005 వసూలు చేసి డివిజన్‌లో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. గుంటూరు స్టేషన్‌లో టీటీగా పనిచేస్తున్న కె.హేమలత 5059 కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.48,17,450 వసూలు చేసి రెండో స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ ఇద్దరు 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు ఈ మొత్తం అపరాధ రుసుం వసూలు చేసి సరికొత్త రికార్డును సృష్టించారని తెలియజేశారు. అభినందించిన వారిలో డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు, ఏసీఎం టి.హెచ్.ప్రసాదరావు, పలువురు అభినందించారని తెలియజేశారు.

23 నుంచి కూచిపూడిలో శిక్షణ




విజయవాడ కల్చరల్: సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ సేవా సంస్థ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 23 నుంచి ఐదు రోజులపాటు కూచిపూడి సంప్రదాయం అంశంగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవ్ కూచిపూడి వ్యవస్థాపకురాలు పెదప్రోలు భావన తెలిపారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కూచిపూడిలోని సిద్ధేంద్రయోగి కళాక్షేత్రంలో నిర్వహించే శిబిరంలో సినీనటి ప్రఖ్యాత కూచిపూడి నృత్య కళాకారిణి మంజూ భార్గవి తన సేవలను అందిస్తారన్నారు. కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి మాట్లాడుతూ భావి తరాలకు కూచిపూడి నాట్య సంప్రదాయ విలువలను తెలియజేయడానికి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాచార పోస్టర్‌ను రామలింగశాస్త్రి ఆవిష్కరించారు. మరిన్ని వివరాలకు 9676 109017, 98490 78707లో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. సేవలో పలువురు ఉభయదాతలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం వివరాలు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 528.90 అడుగుల వద్ద ఉంది. ఇది 166.0068 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమ కాలువకు 6,556, ఎస్ఎల్‌బీసీకి 1,350, వరదకాలువకి 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 8,226 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 8,226 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 806.20 అడుగుల వద్ద ఉంది. ఇది 32.1516 టీఎంసీలకు సమానం.

సౌలభ్యం.. చేరువ

నూతన జిల్లా ఏర్పాటుతో అందుబాటులో ప్రభుత్వ సేవలు

- ఏడు నియోజకవర్గాలతో గత ఏడాది ఏర్పాటైన గుంటూరు జిల్లా
- నూతన జిల్లాలో పట్టణ జనాభా అధికం
- జిల్లాలో రెండు కార్పొరేషన్లు, రెండు మున్సిపాలిటీలు
- తగ్గిన దూరాభారం..
- ప్రజలకు అందుబాటులో అధికార యంత్రాంగం
- డీఆర్సీలో అన్ని సమస్యల ప్రస్తావనకు అవకాశం
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు

గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా, పాలన వికేంద్రీకరణే లక్ష్యంగా సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం నూతన జిల్లాలను ఏర్పాటు చేసింది. విద్య, వైద్య, వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్న గుంటూరు జిల్లా ఈ ఏడాది కాలంలో అన్నిరంగాల్లో విశేష ప్రగతి సాధించింది. ఎక్కడనుంచైనా గంటలోపే జిల్లా కేంద్రానికి చేరుకునేలా భౌగోళిక రూపు ఉండడంతో పాలన సౌలభ్యం ఏర్పడింది. మారు మూల గ్రామంలోని వ్యక్తికి సైతం ప్రభుత్వ సేవలను, పథకాలను సత్వరమే అందించేందుకు వీలు కలిగింది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాల పునర్విభజన జరిగి ఏడాది కావొస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జిల్లాలను ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా జిల్లాలో నరసరావుపేట, బాపట్ల కేంద్రాలుగా కొత్త జిల్లాలు ఏర్పాటు అయ్యాయి. గుంటూరు పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాలు, 18 మండలాలతో 2443 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం 20.91 లక్షల జనాభాతో గుంటూరు జిల్లా ఏర్పాటయింది. గుంటూరు జిల్లా కలెక్టర్‌గా ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా ఎస్పీగా కె.ఆరిఫ్ హఫీజ్ ఏడాది కాలం పూర్తి చేసుకోనున్నారు. గుంటూరు జిల్లా సగానికిపైగా పట్టణ జనాభా కలిగి ఉండటం విశేషం. రెండు కార్పొరేషన్లు, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు కొత్తగా ఏర్పడిన తాడేపల్లి-మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్, తెనాలి, పొన్నూరు మున్సిపాలిటీలు కలిగి ఉండటంతో జిల్లాలో ఎక్కువ భాగం అర్బన్ ప్రాంతాల్లోనే నివసిస్తున్నట్లు అయ్యింది. గతంలో 57 మండలాలు ఉన్న గుంటూరు జిల్లా ఇప్పుడు 18 మండలాలకు పరిమితం అయ్యింది. జిల్లా పరిధి తగ్గిపోవడంతో అధికారులకు జిల్లా పర్యటనలు సులభం అయ్యింది. పరిపాలన అందరికీ అందుబాటులోకి వచ్చింది. దీనిపై జిల్లా ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అడవి తక్కెళ్లపాడులోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం



నాడు-నేడు పనులలో భాగంగా పూర్తయిన చౌత్రా ప్రభుత్వ బాలికల పాఠశాల

అభివృద్ధి, అధికారం అందుబాటులో..



కొత్త జిల్లాల ఏర్పాటుతో అభివృద్ధి, అధికారం అందుబాటులోకి వచ్చినట్లయింది. అధికార వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు పాలన చేరువ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుంది. చిన్నప్రాంతాల ద్వారా అభివృద్ధి జరుగుతుందని చెప్పిన మహనీయుల ఆశయాలను పుణికిపుచ్చుకుని సీఎం జగన్ పాలన అందిస్తున్నారు.

– లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ

మహాత్ముడు, అంబేడ్కర్ భావజాలంతో పాలన



మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ భావజాలాన్ని పుణికి పుచ్చుకుని, వారి ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే సాధ్యమయ్యింది. సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు విప్లవాత్మకం. విజన్ కలిగిన సీఎం జగన్ వల్లే నేటి నూతన జిల్లాల ప్రక్రియ సాధ్యపడింది.

– దొక్కా మాణిక్యవరప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

అందుబాటులో జిల్లా యంత్రాంగం ..



నూతన జిల్లాలతో పేద, మధ్యతరగతి వర్గాలు వారి ఇబ్బందులు చెప్పుకునేందుకు దూరాభారం ప్రయాణం చేయాల్సిన అవసరం లేని పరిస్థితులు ఏర్పడ్డాయి. చిన్న జిల్లాలు కావడం మూలంగా అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు పరిపాలన అందించటం సులభతరం అవుతుంది.

– మద్దాళి గిరిధర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే

పాలన మరింత చేరువగా...



ప్రజలకు మరింత పాలన చేరేలా సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో నూతన జిల్లాలు ఏర్పాటు చేశారు. నూతన జిల్లాల ఏర్పాటుతో ప్రజలు సులువుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి వారికి అవసరమైన అధికారులను కలిసి సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఏర్పడింది.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి, మంగళగిరి ఎమ్మెల్యే

పరిపాలన సులభతరం...



మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా సీఎం జగన్ అడుగులు ముందుకు వేస్తున్నారు. దానిలో భాగంగానే ప్రతి గడపకు పాలన చేరువ చేస్తున్నారు. జిల్లాల ఏర్పాటుతో అధికార వికేంద్రీకరణ ద్వారా పాలన సులభతరం అయింది. అధికారులకు పని ఒత్తిడి తగ్గటం ద్వారా అభివృద్ధి మరిన్ని అడుగులు వేసేందుకు దోహదపడుతున్నాయి.

– కిలారి రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే

చిన్న జిల్లాతో పరిపాలన సౌలభ్యం



మా నియోజకవర్గం తెనాలి. గుంటూరు జిల్లా పరిధిలో ఉంది. రాష్ట్రంలోని 13 జిల్లాలను 26 జిల్లాలుగా విస్తరించటంతో పరిపాలన సౌలభ్యం ఏర్పడింది. గుంటూరు జిల్లా గతంతో పోలిస్తే మూడో వంతుకు తగ్గిపోయింది. సమస్యలు తక్కువయ్యాయి. పరిష్కారానికి అవకాశం చిక్కింది. గతంతో పోలిస్తే ఉన్నతాధికారుల పర్యవేక్షణ అధికమైంది.

– అన్నాబత్తుని శివకుమార్, తెనాలి ఎమ్మెల్యే

చేరువైన పరిపాలన..



రాష్ట్ర విభజన తరువాత ఐదు కోట్ల మంది ప్రజలకు కేవలం 13 జిల్లాలు మాత్రమే మిగిలిన పరిస్థితుల్లో గతేడాది ప్రభుత్వం 26 జిల్లాలుగా విభజించడంతో ప్రజలకు పరిపాలన చేరువైంది. అంతేకాకుండా కేంద్ర పథకాల్లో ఎక్కువ నిధులు రాబట్టేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. అయితే కొత్త జిల్లాల్లో మౌలిక వసతులను కల్పిస్తున్న ప్రభుత్వం నూతన భవన నిర్మాణాలను వేగవంతం చేయడం ద్వారా నూతన జిల్లాల స్వరూపం మారిపోతుంది.

– కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారం



నూతన జిల్లాలతో పరిపాలన సులభతరమైంది. తక్కువ విస్తీర్ణంలో జిల్లా ఉండటంతో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ప్రజా సమస్యలు అతి తక్కువ సమయానికే పరిష్కారం అవుతున్నాయి. ప్రభుత్వ జిల్లా కార్యాలయాలు ప్రజలకు దగ్గరయ్యాయి. పనులు సులభతరంగా జరుగుతున్నాయి. విద్య, వైద్య రంగాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు.

– మేకతోటి సుచరిత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే

ప్రజలకు చేరువగా పరిపాలన..



నూతన జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు పాలన చేరువైంది. గతంలో జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్నవారు ముఖ్యమైన పని ఉంటే వందలాది కిలోమీటర్లు ప్రయాణించి, ఉన్నతాధికారులను కలవాలంటే ప్రయాసలు పడాల్సి వచ్చేది. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ఉన్నతాధికారులే ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు విప్లవాత్మకం.

– షేక్ మొహమ్మద్ ముస్తఫా, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే

చిన్న ప్రాంతాలతోనే అభివృద్ధి..



జిల్లాల విభజన ద్వారా చిన్న ప్రాంతాలు కావటంతో అభివృద్ధి చేయడం సులభమవుతుంది. అధికారులు సైతం సమస్యలను స్పష్టంగా తెలుసుకుని పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించే అవకాశాలు ఉంటాయి. శివారు ప్రాంతాలు, వెనుకబడ్డ ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. జిల్లా కార్యాలయాలను కేవలం నిమిషాల వ్యవధిలోనే చేరుకుని పనులు చక్కబెట్టుకోవచ్చు.

– చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

విద్యాశాఖ నిర్లక్ష్యంతో అవస్థలు

- పరీక్ష కేంద్రాల చిరునామా తెలియక ఇబ్బందులు పడిన విద్యార్థులు
- కేంద్రాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సీఎస్‌లను ఆదేశించిన డీఈఓ శైలజ
- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- జిల్లావ్యాప్తంగా 138 కేంద్రాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పరీక్ష కేంద్రాల ఏర్పాటులో విద్యాశాఖ నిర్లక్ష్య ధోరణి బయటపడింది. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు సంబంధించి ఇచ్చిన హాల్ టికెట్లపై సంబంధిత పాఠశాల పేరు, చిరునామా ముద్రించాల్సి ఉండగా, అవేమీ లేకుండానే జారీ చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం పట్టించుకోకుండా వదిలివేయడంతో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాల్సిన విద్యార్థులు పరీక్ష కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకే ఎక్కడ లేని ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై డీఈఓ పి.శైలజను వివరణ కోరగా, అన్ని పరీక్ష కేంద్రాల వద్ద కోడ్ నంబరు, రోల్ నంబర్లతో బోర్డులు ఏర్పాటు చేయాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించామని చెప్పారు. మెయిన్‌రోడ్డు నుంచి లోపలికి వెళ్లాల్సి వస్తే రోడ్డుపైనే సూచికలతో సహా ఫ్లెక్సీలను ఉంచాలని స్పష్టం చేసినట్లు తెలిపారు.


చిరునామా తెలియక ఇబ్బందులు పడిన విద్యార్థులు..

- గుంటూరు నగరంలో పలు పరీక్ష కేంద్రాల చిరునామా తెలుసుకోవడంలో ఇబ్బందులు పడ్డారు. హాల్ టికెట్లు పొందిన విద్యార్థులను వెంట పెట్టుకుని, ఆదివారం కేంద్రాలను చూసేందుకు వెళ్లిన తల్లిదండ్రులకు కేంద్రాల బయట కోడ్ నంబరు లేకపోవడంతో పరీక్ష కేంద్రం ఇదేనా, కాదా అనే సందేహాలతో సతమతమయ్యారు.
- గుంటూరు నగరంలో సెంటర్ కోడ్ 54040 నంబరుతో హెచ్‌సీ హైస్కూల్, గుంటూరు పేరుతో హాల్ టికెట్లు పొందిన విద్యార్థులకు సంబంధిత సెంటర్ ఎక్కడ ఉన్నదో అర్థం కాలేదు. హిందూ కాలేజీ హైస్కూల్, మార్కెట్ సెంటర్ అని స్పష్టంగా ముద్రించాల్సి ఉండగా, షార్ట్‌కట్ పేర్లతో చిరునామా లేకుండా హాల్ టికెట్లు జారీ చేయడంతో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేశారు.



గుంటూరులోని హిందూ కాలేజీ హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఈఓ శైలజ, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం

- సంబంధిత పరీక్ష కేంద్రం వెలుపల కోడ్ నంబరుతో బోర్డు ఏర్పాటు చేయకుండా, పరీక్ష కేంద్రం లోపల కంటికి కనిపించని విధంగా తెల్ల కాగితంపై వివరాలు ప్రింట్ చేసి గోడకు అతికించారు.
- పరీక్ష కేంద్రాల వద్ద బోర్డులు, ఫ్లెక్సీలు లేని విషయమై ఫిర్యాదులు అందడంతో డీఈఓ పి.శైలజ ఆదివారం సంబంధిత పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం బయట వివరాలు కనిపించే విధంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని చీఫ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాల కేంద్రాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని సీఎస్‌లను ఆదేశిస్తూ సమాచారాన్ని పంపారు.



గుంటూరులోని ఓ పరీక్ష కేంద్రం లోపల కనిపించని విధంగా తెల్ల కాగితంపై ప్రింట్ చేసిన వివరాలు

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 27,714 మంది విద్యార్థులకు 138 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసిన అధికారులు క్షేత్రస్థాయిలో పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులు కనీసం 8.30 కల్లా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఉదయం 8.45 నుంచి 9.30 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆలస్యంగా వచ్చే వారిని అనుమతించని దృష్ట్యా, ముందుగా చేరుకోవడం మంచిది. విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో జారీ చేసిన ఒరిజినల్ హాల్ టిక్కెట్, పెన్ను, పెన్సిల్, రబ్బర్‌తో హాజరు కావాలి. పరీక్ష ప్యాడ్, వాటర్ బాటిల్ వెంట తెచ్చుకోవచ్చు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు వెళ్లి, వచ్చేందుకు వీలుగా హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. పరీక్ష కేంద్రాల వెలుపల సంబంధిత సెంటర్లో విద్యార్థుల రోల్ నంబర్ ఆధారంగా కేటాయించిన రూమ్ నంబర్‌తో బోర్డులను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రానికి చేరుకున్న తరువాత బయట ఉన్న బోర్డులో తమ రోల్ నంబరుకు కేటాయించిన తరగతి గది వివరాలను సరి చూసుకుని వెళ్లాలి.

ధర్మ పరిరక్షణతో లోకహితం

శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

తెనాలి: మనదైన సనాతన హైందవ ఆర్థిక, సామాజిక, ధార్మిక వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని జగద్గురు శ్రీకంచి కామకోటి శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతీస్వామి పేర్కొన్నారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఏర్పాటైన బహిరంగ సభలో భక్తులనుద్దేశించి స్వామి అనుగ్రహభాషణ చేశారు. ధర్మాన్ని పరిరక్షిస్తే లోకాన్ని కాపాడినట్టేనన్నారు. పురాణ కాలాల్లో త్రిలోక సంచారి నారదుడు, ధర్మ ప్రచారకుల్లో అగ్రగణ్యుడుగా గుర్తుచేశారు. ధర్మ ప్రతిష్ట అనేది మన విలువల్ని పరిరక్షిస్తుందని చెప్పారు. ధర్మ ప్రచారానికి కేంద్రాలే ఆలయాలుగా తెలిపారు. అక్కడ విగ్రహారాధనతో నిత్యపూజలు చేస్తూ ధర్మాన్ని కూడా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సభాస్థలి అయిన అమ్మవారి క్షేత్రం ప్రత్యేకతను స్వామి ప్రస్తావించారు. ధర్మాన్ని కాపాడుకునేందుకు ఐకమత్యం చాలా అవసరమన్నారు. దీని ఆవశ్యకతను వేదమంత్రాలన్నీ చెబుతున్నాయని తెలియజేశారు. వేదసంరక్షణలో వైశ్య సమాజం గొప్పగా పనిచేస్తున్నట్టు స్వామి ప్రశంసించారు. అన్నదానం కోసం ఇంత గొప్ప సత్రాలను నిర్మించి అక్కడక్కడా గొప్పగా కృషి చేస్తున్నారని చెప్పారు. అన్ని సమాజాలు సమాజశ్రేయస్సు కోసం యథావిధిగా తోడ్పడాలని అభిప్రాయపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, దేవస్థానం పాలకవర్గ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపారావు, వుప్పల వరదరాజులు స్వామికి స్వాగతం పలికారు. 'డబుల్‌హార్స్' మినపగుళ్ల అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మద్దాళి శేషాచలం, పుచ్చా విజయకుమార్, బూర్లె నరసింహారావు, నూకల భాస్కర్, చుండూరుసాయి, భాస్కరుని లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అనుగ్రహభాషణ చేస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

రావణ వాహనంపై ఆది దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు ఆదివారం రావణ వాహనంపై నగర పుర వీధుల్లో విహరించారు. ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో చైత్రమాస బ్రహ్మోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. మహా మండపం నుంచి ప్రారంభమైన రావణ వాహన సేవను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ పూజలు చేసి ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కొనసాగిన ఊరేగింపు కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కోమల విలాస్, సామారంగం చౌక్ మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంది.



వాహన సేవలో చైర్మన్ రాంబాబు, ఈఓ భ్రమరాంబ

పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శుభాకాంక్షలు

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆకాంక్షించారు. సోమవారం నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆమె ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఏడాది పొడవునా ఎంతో కష్టపడి చదివిన విద్యార్థులు పరీక్షలు చక్కగా రాయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా జెడ్పీ ద్వారా పంపిణీ చేసిన జగనన్న విద్యా జ్యోతి స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందని ఆమె వివరించారు. పది పరీక్షలు విద్యార్థులకు ఎంతో కీలకమని, తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎటువంటి ఆందోళనకు తావు లేకుండా స్వేచ్ఛగా పరీక్షలు రాయాలని ఆమె సూచించారు. దేశంలోనే మొదటిసారిగా అంధ విద్యార్థులు కంప్యూటర్ సాయంతో పబ్లిక్ పరీక్షలు రాసే ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ప్రభుత్వం కల్పించిన ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఆత్రోబ్- 2023 జాతీయ యువజనోత్సవం

కేఎల్‌యూలో ప్రారంభం

తాడేపల్లి రూరల్: మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆత్రోబ్- 2023 పేరిట జాతీయ యువజనోత్సవాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు మాట్లాడుతూ విద్యార్థి ఏ రంగంలో అయినా రాణించాలన్నా, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నా నిబద్ధత, అంకిత భావం ముఖ్యమని అన్నారు. ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న రంగం ఏదైనా సరే దానిలో పూర్తి పరిజ్ఞానాన్ని సముపార్జించాలని అప్పుడే విజయం సాధ్యమవుతుందని అన్నారు. బీఏ విభాగ అధిపతి డాక్టర్ కె.ఎస్.వెంకటేశ్వర కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉండే నైపుణ్యాలను బయటకు తీసి వారిలో నాయకత్వ లక్షణాలు, కార్యనిర్వహణా సామర్థ్యలను పెంపొందించటమే ధ్యేయంగా సాంస్కృతిక పోటీలను నిర్వహించామని అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 500కు పైగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బృంద గీతాలు, సంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలు, సంగీత విభావరులు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి, పాల్గొన్న వారికి ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం యువజనోత్సవాలకు సహకారం ఇచ్చిన ట్రాన్స్‌మీడియా ప్రతినిధి సాయిశ్రవణ్‌ను డీన్ ఎం. కిషోర్‌బాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాయికుమార్, ఆత్రోబ్ కన్వీనర్ డాక్టర్ అవినాష్ రంజన్, అధ్యాపకులు, విద్యార్థి కన్వీనర్లు తెనాలి అపూర్వకుమారి, ప్రీతి పాల్గొన్నారు.



ట్రాన్స్‌మీడియా ప్రతినిధిని సత్కరిస్తున్న కేఎల్‌యూ డీన్ డాక్టర్ కిషోర్‌బాబు

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

అఖిలభారత యాదవ మహాసంఘం జాతీయ అధ్యక్షుడు లక్ష్మయ్యయాదవ్

చిలకలూరిపేట: చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని అఖిల భారత యాదవ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు ముసగాని లక్ష్మయ్య యాదవ్ కోరారు. అఖిలభారత మహాసంఘం కోర్ కమిటీ సమావేశం ఆ సంఘ జాతీయ సెక్రటరీ జనరల్ మద్దుల వెంకటకోటయ్య యాదవ్ నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. లక్ష్మయ్య యాదవ్ మాట్లాడుతూ బీసీల్లో ప్రముఖంగా యాదవులు ఉన్నారని చెప్పారు. యాదవ అభ్యర్థులు ఎన్నికల్లో పోటీ చేసే చోట తమ సంఘం మద్దతు తెలుపుతుందని, ఆ తదుపరి బీసీ అభ్యర్థులు పోటీ చేసే చోట వారికి మద్దతు తెలుపుతామని చెప్పారు. 2024 ఎన్నికల్లో అవకాశం ఉన్న చోట తమ సంఘం తరఫున అభ్యర్థులను నిలుపుతామన్నారు. జన గణనతో పాటు కులగణన చేయాలని డిమాండ్ చేశారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం లభించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ జాతీయ సెక్రటరీ జనరల్ మద్దుల వెంకటకోటయ్య యాదవ్ మాట్లాడుతూ యాదవులు ఐక్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పుటూరి పేరయ్యయాదవ్, జాతీయ క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు పి.లక్ష్మీప్రసాద్ యాదవ్, పీఏసీ చైర్మన్ కె.శ్రీనివాసయాదవ్, రాష్ట్ర సెక్రటరీ జనరల్ బి.రమేష్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిలభారత యాదవ మహాసంఘం నాయకులు

పట్టణాల్లో ఇంటి పంటకు ఆదరణ

ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

కొరిటెపాడు(గుంటూరు): మిద్దెతోట పంటల ఉత్పత్తితో ప్రతి ఇంటా ఆరోగ్యం సాధ్యమని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మిద్దె తోటల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక ఎన్జీఓ కాలనీలోని సప్తర్షి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. తొలుత 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జమ, ఖర్చులను సమావేశంలో పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. అమలకుమారి మాట్లాడుతూ కరోనా తర్వాత ఆహార అలవాట్లలో చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలోనూ పెరుగుతోందని తెలిపారు. రోజువారీ తీసుకునే ఆహారంలో ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూసుకుంటున్నారని పేర్కొన్నారు. మార్కెట్‌లో కొనే కూరగాయల్లో ఎక్కువగా రసాయన అవశేషాలుంటున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారని, దీనిని గుర్తించిన పలువురు పట్టణ, నగరవాసులు టెర్రస్ కూరగాయల, ఆకుకూరల పెంపకానికి శ్రీకారం చుట్టడం జరిగిందని వివరించారు. గుంటూరు జిల్లా మిద్దె తోటల పెంపకం సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి అందులో సుమారు 700 మంది సభ్యులుగా ఉండటం అభినందనీయమన్నారు. జిల్లా మిద్దె తోటల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కొల్లి కృష్ణకుమారి మాట్లాడుతూ పెరటి తోటలు సాగు చేసుకునే వారికి ఆకుకూరలు, కూరగాయల విత్తనాలతో పాటు పండ్ల మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి తక్కువ ధరలకు అందజేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి, కృష్ణకుమారి తదితరులు

జిల్లా మిద్దె తోటల సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా కృష్ణకుమారి

గుంటూరు జిల్లా మిద్దె తోటల సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా కొల్లి కృష్ణకుమారి రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహర్షి ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వి.ఉదయశంకర్, కార్యదర్శిగా బి.రామకృష్ణ పరమహంసరెడ్డి, జాయింట్ సెక్రటరీగా షేక్ సిలార్‌పాషా, కోశాధికారిగా డి.రమణానంద, సభ్యులుగా జి.విమల, యు.శశిధర్, ఎ.హేమలత, షేక్ మహబూబ్‌బాషా ఎన్నికయ్యారు. అలాగే ఇద్దరు ఫేస్‌బుక్ కోఆర్డినేటర్లు, ముగ్గురు సీడ్ బ్యాంక్ కో-ఆర్డినేటర్స్, నలుగురు సేల్స్ కో-ఆర్డినేటర్స్, ఇద్దరు ప్లాంట్ సలహాదారులు, ఇద్దరు లీగల్ సలహాదారులుమరో ఇద్దరు యూట్యూబ్ ఛానల్ కో-ఆర్డినేటర్స్‌గా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

నిబంధనల మేరకే టీచర్లకు డ్యూటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేటర్ల విధుల కేటాయింపులో ఎటువంటి అవకతవకలు లేవని గుంటూరు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు రూరల్ మండల పరిధిలో ఇన్విజిలేటర్లుగా నియమించిన ఉపాధ్యాయులకు ఎటువంటి విచారణ లేకుండా మినహాయింపు ఇచ్చారని ఆప్టా ఉపాధ్యాయ సంఘ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కొంత మంది ఉపాధ్యాయులు మెడికల్, మెటర్నిటీ, చైల్డ్‌కేర్ సెలవుల్లో ఉన్నందున వారికి బదులుగా వేరొక ఉపాధ్యాయులను డీఈఓ అనుమతితో నియమించినట్లు తెలిపారు.

పిడుగుపాటుతో మిర్చి రైతు మృతి

పెదకూరపాడు: పిడుగుపాటుతో మిర్చి రైతు మృతి చెందిన ఘటన పెదకూరపాడులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఏనుగుల నరసింహారావు(46) సాయంత్రం వర్షం పడుతుండగా మిర్చి కల్లాలలో ఉన్న మిరప కాయలపై పట్టలు కప్పేందుకు వెళ్లాడు. ఇంతలో పెద్ద పెద్ద ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం పడటంతో చెట్టు కిందకు వెళ్లే క్రమంలో పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రోజారాణి, కుమార్తె ఆదిలక్ష్మి, కుమారుడు మణికుమార్ ఉన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్ల టౌన్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులుగా ఉన్న ఇద్దరిపై పీడీ చట్టం ప్రయోగించి వారిని ఆదివారం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ గంజాయి వంటి మాదక ద్రవ్యాలు తాగినా, విక్రయించిన, రవాణా చేసినా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. స్టువర్టుపురం గ్రామానికి చెందిన అంగడి చంద్రబాబు అలియాస్ చంద్రపై ఇంకొల్లు, చీరాల 1టౌన్, బాపట్ల రూరల్ స్టేషన్‌లో పలు కేసులు నమోదు కాగా చీరాల మండలం, ఈపూరుపాలెం గ్రామానికి చెందిన అన్నారెడ్డి హైమావతిపై చీరాల రూరల్, బాపట్ల రూరల్ స్టేషన్ పరిధిలో పలు గంజాయి కేసులు ఉన్నాయి. దీంతో ఇద్దరిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ చట్టం కింద అరెస్ట్ చేసినట్లు వివరించారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా మాదకద్రవ్యాలను కలిగి ఉన్న, తాగుతున్న సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, ఎస్పీ హెల్ప్ లైన్ నంబర్ 8333813228 కు, ఎస్ఈబీ టోల్ ఫ్రీ నంబర్ 14500 కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్‌పై హర్షం

చిలకలూరిపేట: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించటం హర్షణీయమని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు చెప్పారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ రూల్స్ వివాదాలకు తావులేకుండా ఉండాలని కోరారు. ఈ విధానం కోసం 40 ఏళ్లగా ఎదురుచూస్తున్నామని చెప్పారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, సీనియారిటీ జాబితాకు అనుగుణంగా మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి విద్యాధికారుల పోస్టులు మంజూరు చేసి మున్సిపల్ ఉపాధ్యాయుల సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు మేకల కోటేశ్వరరావు, షేక్ జమీర్‌బాషా, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు

చేనేత రంగాన్ని నిర్వీర్యం చేసింది చంద్రబాబే

- లోకేష్‌ది టీడీపీ సంక్షోభయాత్రే
- ఎమ్మెల్సీ పోతుల సునీత



చీరాల: పద్నాలుగేళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు హయాంలోనే చేనేత రంగం నిర్వీర్యం అయిందని, ఆప్కో వంటి సంస్థలకు డబ్బులు చెల్లించకుండా ఆ రంగం కుదేలవ్వడానికి కారణమయ్యారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత విమర్శించారు. ఆదివారం చీరాల్లోని ఆమె నివాసంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసి మాట్లాడారు. గతంలో చేనేత రంగానికి ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతోపాటు ఆప్కో ద్వారా చేనేత వస్త్రాలు కొనుగోలు చేయకపోవడంతో అప్పుల బాధతో చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు మగ్గం ఉన్న చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు అందిస్తున్నారన్నారు. దీని ద్వారా చేనేతలు సొంతంగా మగ్గం నేసుకుంటున్నారన్నారు. అలానే చేనేతలకు నాలుగు కార్పొరేషన్ల చైర్మన్లు, తనకు ఎమ్మెల్సీ ఇచ్చారన్నారు. పుట్టపర్తి పాదయాత్రలో లోకేష్ పులివెందులలో జగన్ ప్రాబల్యం తగ్గిందని విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. ముఖ్యమంత్రి కొడుకు అయ్యిండి కనీసం మంగళగిరిలో ఎమ్మెల్యేగా కూడా గెలవలేకపోయారని ఎద్దేవా చేశారు. మళ్లీ మంగళగిరిలో పోటీ చేసి గెలిచే సత్తా లోకేష్‌కు లేదన్నారు. నారా లోకేష్ చేసే పాదయాత్ర టీడీపీకి సంక్షోభ యాత్రేనన్నారు. కనీసం వార్డు మెంబర్, ఎమ్మెల్యేగా గెలవని లోకేష్ పాదయాత్ర ఏ హోదాలో చేస్తారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీఎంవైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందించారన్నారు.

తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం విద్యాధరపురం కబేళా రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో వెలంపల్లి మాట్లాడారు. ప్రపంచ కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు నిర్వహించటం మన సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమని చెప్పారు. శ్రీశ్రీ కళావేదిక కృష్ణా జిల్లా అధ్యక్షురాలు బంక నాగ పావని మాట్లాడుతూ సంస్థ అంతర్జాతీయ గౌరవ అధ్యక్షుడు కింగ్ ఇంద్ర ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నేతృత్వంలో జరిగే ఈ వేడుకల్లో పలువురు సాహితీ ప్రియులు పాల్గొంటారని తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ కొల్లి రమాపతి, ప్రోగ్రాం కన్వీనర్ గుత్తా హరి సర్వోత్తమ నాయుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్పొరేటర్లు అత్తలూరి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరువ చేయాలి

మంత్రి మేరుగ నాగార్జున

వేమూరు: సంక్షేమ పథకాలను ఇంటింటికి చేరువ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గెలుపు గ్రామ సచివాలయం కన్వీనర్లు పని తీరుపై ఆధారపడి ఉంటుందని హెచ్చరించారు. ఈ నెల 7వ తేదీ నుంచి 14వ వరకు గ్రామ సర్పంచి, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసు కోవాలని చెప్పారు. కుటుంబ సభ్యులతో మాట్లాడాలని సూచించారు. గత ప్రభుత్వం పని తీరు, ఇప్పటి ప్రభుత్వం పని తీరు గురించి అడిగి తెలుసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రోడ్లు అన్ని వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో వ్యవసాయం, విద్య వైద్యం రంగాలకు ప్రాధాన్యం కల్పించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ యల్లమాటి మోహన్, జెడ్పీటీసీ సభ్యులు గాజుల హేమలత, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, అమృతలూరు, చుండూరు ఎంపీపీలు రాపర్ల నరేంద్ర, జాలాది రూబేను, కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పరు సుబ్బారావు, మండల గ్రామ సచివాలయం కన్వీనర్లు దాది సుబ్బారావు, సిహెచ్.సుబ్బారావు, బి.మోషే, చిన్న బుజ్జి, అనవరపు వీరా రెడ్డి, చుండూరు సర్పంచి వి.అప్పిరెడ్డి పాల్గొన్నారు.



వేమూరు మార్కెట్ యార్డులో గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

అ'పూర్వ' సమ్మేళనం

40 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కర్లపాలెం: యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం గుంటూరులోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. యాజలి ఉన్నత పాఠశాలలో 1983-1984లో 10వ తరగతి చదివిన విద్యార్థులు వివిధ రంగాలలో స్థిరపడ్డారు. 40 ఏళ్ల తరువాత అందరూ తమ మిత్రుల వివరాలను సేకరించి గుంటూరులోని ఓ హోటల్‌లో కలుసుకున్నారు. చిన్ననాటి పాఠశాలలో జరిగిన ఘటనలను గుర్తు చేసుకుని తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను నెమరు వేసుకున్నారు. అనంతరం కలసి భోజనం చేశారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు కృష్ణంరాజు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యంపరాల శ్రీనివాసరావు, గుడిశా బ్రమ్మయ్య, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, విజయభాస్కర్, జానకిరామయ్య, లాభాన్‌రాజు, ఇనుముల డేవిడ్, జానకిరామయ్య, సత్యనారాయణరాజు, మురళీ ప్రసాద్, స్వామిరెడ్డి, చలపతిరెడ్డి, మువ్వా శ్రీనివాసరావు, శివ శంకర్, దొంతిరెడ్డి ఏడుకొండలరెడ్డి పాల్గొన్నారు.



1983- 84 బ్యాచ్ యాజలి హైస్కూల్ విద్యార్థులు

డీవీఎం పద్యాలు చైతన్య శిల్పాలు



డీవీఎం దంపతులను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

అద్దంకి: డీవీఎం సత్యనారాయణ రచించిన పద్యాలు సజీవ శిల్పాలని ప్రకాశం జిల్లా ఖజానా శాఖ డెప్యూటీ డైరెక్టర్ అన్నాపంతుల జగన్నాథరావు పేర్కొన్నారు. స్థానిక రామసుశీల నిలయంలో డీవీఎం రచనలపై ఆదివారం నిర్వహించిన సాహితీ సమీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. అన్నపంతుల మాట్లాడుతూ డీవీఎం పద్యాలు సజీవ శిల్పాలవలే మనతో మాట్లాడినట్లుగా ఉంటాయన్నారు. ప్రతి వారికి అర్థమయ్యే రీతిలో రచనలు ఉన్నాయని జిల్లా రచయితల సంఘ సమాఖ్య అధ్యక్షుడు నూనె అంకమ్మరావు అన్నారు. భజ గోవిందం కావ్యంలో ఆధ్యాత్మిక జ్ఞానం గురించి, వైరాగ్య భావనల గురించి కవి తేటతెల్లంగా అందించాడని లక్కరాజు శ్రీనివాసరావు అన్నారు. పండిత పామరులు మెచ్చే విధంగా డీవీఎం రచనలు ఉంటాయని పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి అన్నారు. కల్మషం లేని గ్రామీణ ప్రజల జీవనాన్ని ప్రతిబింబించే విధంగా ఉన్న గ్రంథం ఆంధ్ర గాథాలహరి అని ఆర్వీ రాఘవరావు డీవీఎం రచనల గురించి సమీక్ష నిర్వహించారు. అనంతరం డీవీఎం దంపతులను సత్కరించి జ్ఞాపకను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ యూ దేవపాలన, ఏ లేవీ ప్రసాద్, ఎం మల్లికార్జునరావు, పీసీహెచ్ కోటయ్య, మన్నం త్రిమూర్తులు, ఎన్ శ్రీలక్ష్మి, డీ శ్రావన్‌కుమార్, తమ్మన శ్రీనివాసరావు, ఓ శ్రీనివాసులు, కే రామకోటేశ్వరరావు, ఎన్‌రాఘవ, కే నాగయ్య, అంజాద్‌బాషా, సాహితీ మిత్రమండలి సభ్యులు, సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గుణదలలో ఘనంగా మట్టల ఆదివారం

గుణదల(విజయవాడ తూర్పు): సర్వ మానవాళి రక్షణార్థమై అవతరించిన ఏసుక్రీస్తు లోక రక్షకుడని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గుణదల పుణ్యక్షేత్రంలో మానుకొమ్మల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ గురువులు సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఫాదర్ జయరాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు పరిశుద్ధ యేరుషలేం దేవాలయంలోనికి అడుగుపెట్టిన రోజును మట్టల ఆదివారంగా జరుపుకొంటామని తెలిపారు. ఆ సమయంలో యేసుక్రీస్తును గాడిదపై ఊరేగిస్తూ ఖర్జూర మట్టలతో యూదుల సంప్రదాయం ప్రకారం ఆయనను కొనియాడారని గుర్తు చేశారు. తన ప్రవచనాల ద్వారా యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిన క్రీస్తు కాలానికి కొలమానంగా అవతరించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలు అనుసరించాలని కోరారు. అనంతరం సమష్టి దివ్యబలిపూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. క్రీస్తు విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరై మట్టలను చేబూని హోసన్నా.. హోసన్నా అంటూ దేవుని స్తుతిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మరియన్న, ఫాదర్ థామస్, ఫాదర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం